క్లుప్తంగా

ఆర్ఎంపీ క్లినిక్‌ల తనిఖీ



శాంతిపురం: తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

శాంతిపురం: మండల కేంద్రంలోని అనికెర క్రాస్‌లోని ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లను మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. కలెక్టర్, డీఎంహెచ్ఓల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్టు వైద్యాధికారి తెలిపారు. ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లు నిర్వహించే వారు డాక్టర్ అనే పేరును వాడుకోరాదన్నారు. ఇంజక్షన్లు, సెలైన్లు వినియోగించక ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని చెప్పారు. నిబంధనలు పాటించని క్లినిక్‌లపై చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. తనిఖీల్లో ఎంపీహెచ్ఓలు లతీఫ్‌ఖాన్, కోదండపాణి పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి



క్లినిక్‌ను తనిఖీ చేసి సూచనలిస్తున్న వైద్యులు

చౌడేపల్లె: ఆర్ఎంపీ క్లినిక్‌లో ప్రథమ చికిత్సలు మాత్రమే చేయాలని డాక్టర్లు పూజ, నవీన్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం చౌడేపల్లెలోని పీఎంపీ, ఆర్ఎంపీ క్లినిక్‌లను వారు తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, రోగులకు ఇంజక్షన్లు వేయరాదని, సెలైన్ పెట్టరాదన్నారు. కొన్ని క్లినిక్‌లకు సరైన రికార్డులు సైతం లేకపోవడం గుర్తించినట్లు వారు పేర్కొన్నారు. పాటించాల్సిన నియమ నిబంధనల పత్రాలను అందజేశారు. నిబంధనలు పాటించకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గుడుపల్లె: అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం మండలంలోని గుడుపల్లె, శెట్టిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. రెండు శిబిరాల్లో 951 మంది కంటి పరీక్షలు చేసుకున్నారు. ఇందులో శస్త్రచికిత్సకు 213 మంది, కంటి అద్దాలు తీసుకున్న వారు 578, మంది చిన్న చిన్న కంటి సమస్యలు ఉన్న వారు 163 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీతారాం, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, అధికారులు పాల్గొన్నారు.

కల్పతరువులా దోస సాగు

- రైతన్నలకు బహుబాగు
- తక్కువ పెట్టుబడితో నికర లాభాలు
- పంటకాలం కేవలం రెండున్నర నెల
- స్థానికంగానే మార్కెట్ సౌకర్యం
- బైబ్యాక్‌లో ప్రైవేట్ కంపెనీల కొనుగోళ్లు



కొలమాసనపల్లి పంచాయతీలో సాగవుతున్న దోస పంట



ఏపుగా పెరిగిన దోసకాయలు

పలమనేరు: పలు రకాల పంటలు చేసి ఆశించిన ధరల్లేక ఆందోళన చెందకుండా రైతన్నలకు తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో తక్కువ సమయంలో సాగయ్యే దోస పంట కల్పతరువులా మారింది. స్థానిక మార్కెట్‌లోనే పంటను విక్రయించుకోవడంతో పాటు కూలీల సమస్య తక్కువగా ఉంటుంది. కాబట్టే ప్రస్తుత తరుణంలో దోస సాగు ఎంతో ఉత్తమమని ఉద్యానశాఖ చెబుతోంది. ప్రస్తుతం దోస కిలో రూ.12 నుంచి రూ.16 దాకా ఉంది. ఆ లెక్కన టన్ను ధర రూ.16 వేలు. ఎకరానికి 15 టన్నులు పంట పండినా రూ.2.30 లక్షల దాకా వస్తుంది.దీనికి ఖర్చు ఎకరానికి రూ.50వేలు పోయినా రూ.1.80 లక్షల నిఖర ఆదాయం పొందవచ్చు.

దోస సాగుకు పలమనేరు వాతావరణం అనుకూలం..

తీగ రకానికి చెందిన దోస గుమ్మడి, అనపలను పోలి ఉంటుంది. ఇందులో తక్కువ కేలరీలు, ఎక్కువగా విటమిన్లు ఏ, సీ ఉంటాయి. దాహాన్ని తీర్చగలిగే గుణం ఉన్న పండు ఇది. ఇవి చిత్తూరు జిల్లాలోని పడమటి నియోజకవర్గాల ఉష్ణోగ్రతకు చాలా అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలోని పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, కుప్పం నియోజకవర్గాల్లో ఎక్కువగా పంట సాగు అవుతోంది. ఇసుకవాటం, ఎర్రటి, ఒండ్రునేలల్లో సాగు అవుతుంది. ముఖ్యంగా ఉదజని సూచిక 6.0–6.7 ఉన్న నేలలు పంటకు అనుకూలంగా ఉంటాయి. ఏడాది పొడవునా పంటను సాగు చేసుకోవచ్చు. ప్రస్తుతం పలు హైబ్రిడ్ రకాల విత్తనాలను స్థానికంగా రైతులు ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఎకరాకు 350 గ్రాముల విత్తనాలు సరిపోతాయి.

యాజమాన్య పద్ధతులను పాటించాలి..

పంటలో ఆడ పూలు ఎక్కువగా వస్తాయి కాబట్టి పిందె బాగా నిలవడానికి మూడు ఆకుల స్టేజ్‌లో బోరాక్స్‌ను లీటర్ నీటికి రెండు గ్రాములు చొప్పున పిచికారీ చేసుకోవాలి. పూత రావడానికి ముందు తీగ చివర్లను తుంచడంతో పక్కతీగలు అభివృద్ధి చెంది దిగుబడి పెరుగుతుంది. కాబట్టి నీటి లభ్యత తక్కువగా ఉన్న రైతులు తక్కువ పెట్టుబడితో తక్కువ కూలీలతో సులభంగా ఈ పంటను సాగుచేసుకోవచ్చు.

లోకల్ మార్కెట్‌తోపాటు బైబ్యాక్ పాలసీ సైతం..

దోసను స్థానిక మార్కెట్లలోనూ రైతులు అమ్ముకోవచ్చు. వీటికి చైన్నై, బెంగళూరుల్లోనూ మార్కెట్ సౌకర్యం ఉంది. ఇది కాకుండా కొన్ని ప్రైవేట్ కంపెనీలు సైతం రైతులతో ముందుగానే ధరను మాట్లాడి ఆపై బైబ్యాక్ పాలసీ ద్వారా సైతం ఆయా కంపెనీలు తోటల వద్దకొచ్చి దోసను కొంటున్నారు.

“

ప్రస్తుతం దోస రైతులకు గిట్టుబాటు..



టమాట, బంగాళాదుంప, క్యాబేజీ లాంటి పంటలకు ధరలు ఎప్పుడుంటాయే తెలియదు. దోస పంటలో భారీ లాభాలు రాకున్నా పెట్టిన పెట్టుబడికి రాకుండా పోయే ప్రమాదం ఉండదు. దీంతో రైతులకు లాభసాటిగా ఉంటుంది. టన్ను రూ.15 వేలు ఉన్న రైతుకు గిట్టుబాటుగానే ఉంటుంది. రైతులు డిమాండ్ ఉన్న ఇలాంటి పంటలను సాగుచేసుకోవడం మేలు.

గజేంద్ర, రైతు, తొప్పనపల్లి, పలమనేరు మండలం

పంట సంరక్షణకు రూ.10వేలు ఇస్తున్నా..



నేను మూడెకరాల భూమిని కర్ణాటకకు చెందిన ఓ ప్రైవేటు కంపెనీకి కాంట్రాక్టు వ్యవసాయానికి ఇచ్చా. వారు దోసను సాగుచేశారు. ఎరువులు, మందులు, కూలీల ఖర్చు, రైతుగా తాను పంట సంరక్షణకు నెలకు పదివేలు ఇస్తున్నా. గతంలో నిర్ణయించిన ధరను మన బ్యాంకు ఖాతాలోకి కంపెనీ చెల్లిస్తుంది.

అమ్మన్నమ్మ, మారుమూరు, పలమనేరు మండలం

గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

కుప్పం: వినాయకచవితి సందర్భంగా గణేష్ ఉత్సవాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులరాజు, డీఎస్పీ పార్థసారథి తెలిపారు. మంగళవారం తహసీల్దార్, విద్యుత్ శాఖ, అగ్నిమాక సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గణేష్ ఉత్సవాల కమిటీ జరిపే స్థలం ఫొటో జతపరచి అనుమతులు పొందాలని సూచించారు. ఉత్సవాల్లో, నిమజ్జనం సమయంలో ఏలాంటి గొడవలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని వారు సూచించారు. స్థానికంగా పోలీస్‌స్టేషన్‌లో అనుమతులు తీసుకుని ఉత్సవాలు నిర్వహించాలని పేర్కొన్నారు.

స్టాంపుల కొరత

పుంగనూరు: పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జుడిషియల్ స్టాంపులు కొరత తీవ్రం కావడంతో ప్రజలు, న్యాయవాదులు అవస్థలు పడుతున్నారు. గత నెల రోజులుగా స్టాంపులు లేకపోవడంతో సమస్య తీవ్రమవుతోందని వాపోతున్నారు. కేవలం 10, 20 రూపాయలు స్టాంపులు మాత్రమే అందుబాటులో ఉండడం, 1, 2, 5 రూపాయల స్టాంపులు లేకపోవడంతో సమస్య తీవ్రమైంది. దీనిపై జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకుని, స్టాంపుల సరఫరా చేయాలని కోరుతున్నారు.

బీజేపీ రాష్ట్ర కో-కన్వీనర్‌గా మాదాస్ లోకేష్

కల్లూరు (రొంపిచెర్ల): బీజేపీ రాష్ట్ర కో–కన్వీనర్‌గా చిత్తూరు జిల్లా కల్లూరుకు చెందిన మాదాస్ లోకేష్‌ను నియమిస్తూ రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ మంగళవారం నియామకపత్రం పంపారు. పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని ఆయన సూచించారు.

నిర్మానుష్యంగా వి.కోట



పట్టణంలో పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

- వి.కోటలో 144 సెక్షన్ అమలు
- అక్కడే కలెక్టర్, ఎస్పీ మకాం
- ఇరువర్గాలతో శాంతి కమిటీ చర్చలు

వి.కోట: సోమవారం మండలంలో క్రికెట్ బాల్‌తో రెండు వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలు సోమవారం రాత్రి 2 గంటల వరకు కొనసాగాయి. ఘర్షణల్లో ఓ వర్గానికి చెందిన వ్యక్తులు మరో వర్గానికి చెందిన దుకాణాలను ధ్వంసం చేశారు. దీన్ని జీర్ణించుకోలేని మరో వర్గంలోని వ్యక్తులు, ఒక వర్గానికి చెందిన వ్యక్తికి సంబంధించిన 7 బస్సులను అర్ధరాత్రి సమయంలో ధ్వంసం చేసి, అతని ఇంటి కిటికీ అద్దాలను పగలగొట్టడంతోపాటు, బైక్‌కు నిప్పంటించారు. అంతేకాక రాత్రి 12 గంటల సమయంలో పట్టణంలో వెళుతున్న ఓ వ్యక్తి బైక్ ఆపి కొట్టి, బైక్‌ను ధ్వంసం చేశారు. విషయం తెలిసి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునేలోపు ఆ వర్గం వారు పరారయ్యారు. సోమవారం రాత్రి కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ చందోలు, పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ వి.కోటకు చేరుకుని ధర్నా చేస్తున్న వర్గంతో చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. మరో వర్గం వారు పోలీసులపైకే రాళ్లు విసరడం, డీఎస్పీకి గాయాలయ్యాయి. దీంతో కలెక్టర్, ఎస్పీ వి.కోటలో మకాం వేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించారు. మంగళవారం ఉదయం జిల్లా అధికారులు ఇరువర్గాలతో చర్చింది శాంతి కమిటీని ఏర్పాటు చేశారు. మళ్లీ గొడవలు పునరావృతంగా కాకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్, ఎస్పీ ప్రకటించారు. మరోవైపు మండలంలో 144 సెక్షన్ అమలు చేసి భారీగా పోలీసులను మోహరించారు. దీంతో పట్టణంలో నిర్మానుష్యంగా మారింది. ఏది ఏమైనా క్రికెట్ బాల్ తెచ్చిన చిన్న గొడవ ఇరు వర్గాల మధ్య గొడవలు చెలరేగడం పట్టణ ప్రజలను భయభ్రాంతులను గురిచేసింది.

విధిగా రక్త, గల్ల పరీక్షలు



మాట్లాడుతున్న జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): క్షయ వ్యాధుల నిర్ధారణ పరీక్ష విషయంలో ల్యాబ్ సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా అనుమానితులకు రక్త, గల్ల పరీక్షలు చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ ఆదేశించారు. చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ల్యాబ్ టెక్నీషియన్లకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ల్యాబ్ సిబ్బంది ఓపీకి వచ్చే వారిలో 10 శాతం మందికి గల్ల పరీక్షలు చేయాలన్నారు. పాజిటివ్‌గా గుర్తిస్తే వారికి మెరుగైన వైద్యం అందించి క్రమం తప్పకుండా మాత్రలు పంపిణీ చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించాలని, తీవ్ర జ్వరంతో ఎవరైనా బాధపడుతున్న పక్షంలో మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆయన తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, వైద్యశాలల్లో వైద్యసేవలు పొందేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎంఓ అనిల్‌కుమార్, అధికారులు రామచంద్రారెడ్డి, శివ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఉద్యోగాలకు నైపుణ్యం ముఖ్యం

–జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగాలకు అభ్యర్థులు నైపుణ్యాలు కలిగి ఉండడం ముఖ్యమని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఉద్యోగమేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్, డిగ్రీ చదివే విద్యార్థులు నైపుణ్యాలపై ఆసక్తి చూపించాలన్నారు. చదివే సమయంలోనే నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు. జిల్లా ఉపాధి కల్పనా అధికారి పద్మజ మాట్లాడుతూ విద్యార్థులు వివిధ కోర్సుల్లో మక్కువ చూపడమే కాకుండా వాటికి తగ్గట్టు నైపుణ్యాలు పెంపొందించుకుంటే సులువుగా ఉద్యోగాలు పొందవచ్చన్నారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు వివిధ ప్రాంతాల నుంచి 134 మంది హాజరయ్యారని, వీరిని ఇంటర్వ్యూలు చేసి 46 మంది వివిధ కంపెనీల్లో ఎంపిక చేసినట్లు ఈసందర్భంగా ఆయన తెలిపారు.

అలంకారప్రాయంగా ఆర్వో ప్లాంటు



మూతపడిన ఆర్వో ప్లాంటు

- మూలన పడిన నీటి శుద్ధి యంత్రాలు
- పట్టించుకోని అధికారులు
- పునఃప్రారంభించాలంటున్న గ్రామస్తులు

ప్రజలకు సురక్షితమైన నీటిని అందించాలనే సదాయంతో లక్షలు వెచ్చించి, ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. రూ.2లకే స్వచ్ఛమైన నీరు అందించేందుకు అప్పట్లో ప్రభుత్వం లక్షలు వెచ్చించి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసినా అవి వినియోగంలోలేక తుప్పుపడుతున్నాయి.

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటకు సురక్షిత నీరు అందించేందుకు 2017లో ఎంపీ నిధుల నుంచి రూ.5 లక్షలతో ఆర్వో ప్లాంటు నిర్మించి 20 లీటర్ల ఫిల్టర్ నీటిని రెండు రూపాయలకే గ్రామస్తులకు అందజేశారు. ప్లాంటును రైతు శిక్షణ, సహాయక కేంద్రంలో ప్రారంభించారు. కొంతకాలం పనిచేసిన ఆర్వో ప్లాంటులో నీటి శుద్ధి యంత్రాలు పాడైపోవడంతో గ్రామస్తులకు శుద్ధి నీరు లభించడం లేదు. ఆర్వో ప్లాంటు నిర్వహణ గ్రామ పంచాయతీ ఆధీనంలో లేక పోవడం, యంత్రాలకు మరమ్మతులు చేయకపోవడంతో రెండేళ్ల క్రితం మూత పడింది. అప్పటి నుంచి ఆర్వో ప్లాంటును పునఃప్రారంభించాలని గ్రామస్తులు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంటును వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇంటి తలుపులు పగులగొట్టి చోరీ

–45 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి చోరీ



చెల్లాచెదురుగా బీరువాలోని వస్తువులు

శాంతిపురం: కెనమాకులపల్లి పంచాయతీలోని బడుగుమాకులపల్లిలో తాళం వేసిన ఇంటి తలుపులు పగులగొట్టి దొంగలు ఇంట్లోని నగలు, నగదు పట్టుకుపోయారు. బాధితుడు కుమార్ కథనం మేరకు వివరాలు. తమిళనాడుకు చెందిన కుమార్ కుటుంబం 30 ఏళ్ల క్రితం బడుగుమాకులపల్లికి వచ్చి నివసిస్తున్నారు. పాతవస్తువులు కొంటూ, అల్యూమినియం, స్టీల్ పాత్రలు అమ్మే వ్యాపారం చేస్తూ ముగ్గురు కుమార్తెల్లో ఇద్దరికి పెళ్లి చేశాడు. మూడో కుమార్తె పెళ్లి ప్రయత్నాలు కొలిక్కి రావడంతో 45 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండితో పాటు ఇటీవలే చీటీ పాడి రూ 2.60 లక్షల నగదును ఇంట్లో పెట్టాడు. తమిళనాడులో ఉంటున్న తన తండ్రి ఆదివారం రాత్రి మృతిచెందడంతో సోమవారం తెల్లవారుజామునే కుమార్ కుటుంబం సహా అక్కడికి వెళ్లారు. మంగళవారం తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు తెరిచి, బీరువాను బద్దలు కొట్టి అందులోని నగలు, నగదును దొంగలు దోచుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాళ్లబూదుగూరు ఎస్ఐ ఐ నరేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ముందుగా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ఏటీఎంలకు భద్రత కరువు!

- పలుచోట్ల సెక్యూరిటీ గార్డుల ఊసేలేదు
- రాత్రుల్లో కొందరికి ఇవి పడక గదులు
- చంద్రగిరి ఘటనతో తెరపైకి ఏటీఎంల భద్రతపై చర్చ



పలమనేరులోని ఏటీఎంలో రాత్రిపూట పడుకుంటూ ఓ రోజు మృతి చెందిన వ్యక్తి(ఫైల్)



పలమనేరులోని ఏటీఎంలో విశ్రాంతి తీసుకుంటున్న శునకం (ఫైల్)

పలమనేరు: బ్యాంకుల వద్ద భద్రత కోసం సెక్యూరిటీని పెట్టుకొని, బ్యాంకులో సీసీ కెమెరాలను అమర్చుకున్న బ్యాంకు అధికారులు ఏటీఎంల వద్ద మాత్రం ఎందుకు పట్టించుకోవడం లేదని సామాన్య ఖాతాదారుడి అనుమానం. తాజాగా నాలుగురోజుల క్రితం చంద్రగిరిలోని ఏటీఎంలో చాకచక్యంగా చోరీ జరిగింది. నిందితులను అక్కడి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీసీ కెమెరాలు లేకపోవడం ఇందులో ఏటీఎం ప్రైవేట్ సెక్యూరిటీ కస్టోడియన్‌గా తేలిన విషయం తెలిసిందే. అంతకుముందు తిరుపతి రూరల్ మండలంలోని ధనలక్ష్మినగర్ ఎస్‌బీఐ ఏటీఎంలో దుండగులు ఏకంగా గ్యాస్‌కట్టర్‌తో యంత్రాలను కట్ చేసి అందులోని రూ.18.26లక్షలను చోరీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏటీఎంల భద్రత విషయం మరోసారి చర్చనీయాంశమైంది. ఏటీఎంల పర్యవేక్షణ బ్యాంకర్లకు కాక ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వడంతో ఇలాంటి చోరీలకు అవకాశంగా మారింది.

భయం లేకుండా ఏటీఎంలలోనే మకాం..

ఉమ్మడి జిల్లాలోని పలు ఏటీఎం సెంటర్లలో గతంలో ఇలాంటి చోరీలు జరిగాయి. పలమనేరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎస్‌బీఐ ఏటీఎంలో చిప్ హ్యాక్ చేసి పలువురు ఖాతాల నుంచి వారికి తెలియకుండానే లక్షల్లో కుంభకోణం అప్పట్లో సంచలనం సృష్టించింది. పట్టణంలోని హైవేకు పక్కన రెండు గంటలకు పైగా దుండగులు ఏటీఎంలో గడిపి ఆ యంత్రంలోని పలు పరికరాలను తొలగించి వారి సిస్టంకు అనుసంధానించిన చిప్‌లు ఏటీఎంలో అమర్చి దర్జాగా వెళ్లిపోయారు. దీన్ని బట్టి ఏటీఎం కేంద్రాల్లో భద్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు ఇదే ఏటీఎంలో మళ్లీ చోరీకి యత్నం జరిగింది. అంతకుముందు మదనపల్లి రోడ్డులోని ఏటీఎం, ఆర్టీసీ బస్టాండులోని ఏటీఎంలలో చోరీకి విఫలయత్నాలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని ఏదో ప్రాంతంలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఏదేని పెద్ద ఘటన జరిగినపుడు స్పందించడంపై పట్టించుకోకపోవడం షరా మామూలుగా మారింది.

బ్యాంకర్లకు పర్యవేక్షణ లేదట...

ఉమ్మడి జిల్లాలో మూడొందలకుపైగా ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులున్నాయి. వీటికి సంబంధించి 1,200 ఏటీఎం కేంద్రాలున్నాయి. వీటిలో నగదు పెట్టడం నుంచి వాటి నిర్వహణ వరకు ప్రైవేట్ ఏజెన్సీలు చూస్తున్నాయి. దీంతో సంబంధిత బ్యాంకర్లు ఇక ఏటీఎంలతో తమకు సంబంధం లేదనేలా మాట్లాడుతున్నారు. ఫలితంగా ప్రైవేట్ బ్యాంకుల ఏటీఎంలను మినహాయిస్తే ఎస్‌బీఐ, ఇండియన్‌బ్యాంకు, సప్తగిరిలాంటి బ్యాంకులకు సంబంధిచిన ఏటీఎంల వద్ద భద్రతా సిబ్బంది కనిపిస్తే ఒట్టు.

ఏటీఎం సెంటర్లే షెల్టర్లు..

కొన్ని ఆవాస ప్రాంతాల్లోని ఏటీఎంలు వర్షానికి, చలికి, వేడిలో ఏసీ కోసం షెల్టర్లుగా మారాయి. గతంలో పలమనేరులోని ఓ బ్యాంకు ఏటీఎంలో ఓ వ్యక్తి తరచూ రాత్రిపూట నిద్రించేవాడు. అదే ఏటీఎంలో అతను మృతిచెందిన విషయం తెలిసిందే. కొన్ని ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులు లేక బార్లా తెరుచుకుని ఉండే చోట్ల లోపల శునకాలు కనిపిస్తున్నాయి. కేవలం ఏటీఎంలలో నగదు పెట్టడం తప్ప భద్రతకు సంబంధించిన విషయాలను ప్రైవేటు ఏజెన్సీలు ఏమాత్రం పట్టించుకోవడం లేదనేది పచ్చినిజం. దీనిపై పోలీస్ ఉన్నతాధికారులు బ్యాంకర్లతో సమావేశాన్ని నిర్వహించి ఖాతాదారుల నగదును ఏటీఎంలో సురక్షితంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

రాయితీపై ఉలవల పంపిణీ



బేలుపల్లెలో ఉలవలు పంపిణీ చేస్తున్న అధికారులు

బైరెడ్డిపల్లె: మండలంలోని బేలుపల్లెలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు 80శాతం రాయితీపై రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. వ్యవసాయశాఖాధికారి గీతాకుమారి మాట్లాడుతూ రైతులను ఆదుకోవడానికి 80 శాతం రాయితీతో ఉలవలు పంపిణీ చేస్తామని తెలిపారు. రాయితీ ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేరు నమోదు చేసుకోవాలన్నారు.

80 శాతం సబ్సిడీపై ఉలవలు

పుంగనూరు: రైతులకు 80 శాతం సబ్సిడీ ధరపై ఉలవలు పంపిణీ చేయనున్నట్లు ఏడీ శివకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పుంగనూరుకు 294 క్వింటాళ్లు, చౌడేపల్లె 213, సోమల 173, సదుం 103, పులిచెర్ల 91, రొంపిచెర్ల 150, పెద్దపంజాణి 360, గంగవరం 250 క్వింటాళ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు తమ సేవా కేంద్రాలలో ఆధార్, పాసుపుస్తకం తీసుకుని, బయోమెట్రిక్ ద్వారా ఉలవలు పొందాలన్నారు.

గంగవరం..

గంగవరం: రైతులకు 80శాతం సబ్సిడీ ద్వారా ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ హేమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయ పంటగా ఉలవలు వేయాలనుకునే రైతులకు ఉలవ విత్తనాలు 80శాతం సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో కలిపి మొత్తం 250 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉంచినట్టు తెలిపారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: రైతులకు ఉలవ విత్తనాలు రాయితీతో ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యవసాయశాఖ అధికారి నాగరాజు తెలిపారు. మండలంలోని 18 రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 5వ తేదీ నుంచి రైతులకు అందిస్తామన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదార్ పాసుపుస్తకం, ఫోన్ నంబర్ తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళ్లాలన్నారు.



పుంగనూరు: మాట్లాడుతున్న ఏడీ